
సాక్షి గుంటూరు

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



అంకమ్మ తల్లి ఊరేగింపు

వేమూరు : చావలి గ్రామ దేవత అంకమ్మ తల్లి ఊరేగింపు శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు దంపతులు పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.50 అడుగుల వద్ద ఉంది. ఇది 139.4380 టీఎంసీలకు సమానం.



కారు దగ్ధం

బాపట్ల: మండలంలోని సూర్యలంక సమీపంలో శుక్రవారం రాత్రి కారు దగ్ధమైంది. హైదరాబాద్ నుంచి వచ్చిన పర్యాటకులంతా బయటకు రావడంతో ప్రమాదం తప్పింది.

సెలవులకు సెలవ్ !

- విద్యార్థులపై చదువుల ఒత్తిడి
- వేసవి సెలవులకు ఎగనామం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల ఇష్టారాజ్యం
- టెన్త్ పాస్ అయిన విద్యార్థులకు జూనియర్ ఇంటర్ తరగతుల నిర్వహణ
- జూనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సీనియర్ ఇంటర్ తరగతులు
- వేసవి ఎండల తీవ్రతతో క్లాస్ రూముల్లో అల్లాడుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు అవలంబిస్తున్న విధానాలకు విద్యార్థులు బలవుతున్నారు. విద్యా సంవత్సరం పొడవునా తరగతి గదులకే పరిమితమవుతున్నారు. వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన సెలవులు సైతం ఇవ్వకుండా యాజమాన్యాలు వేధింపులకు గురిచేస్తున్నాయి. పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులను సైతం వదలడం లేదు. వేసవి సెలవుల అనంతరం నిర్వహించాల్సిన తరగతులను ఇప్పుడే ప్రారంభించేసి విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం సీనియర్, జూనియర్ ఇంటర్ తరగతులు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మార్చిలో పరీక్షలు రాసిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు సీనియర్ ఇంటర్ తరగతులను ప్రారంభించేశారు. టెన్త్ ప్యాసైన విద్యార్థులను అప్పుడే కళాశాలల్లో చేర్చుకోవడం మొదలు జూనియర్ ఇంటర్ తరగతులను కూడా ప్రారంభించేశారు.

తీవ్ర ఆందోళనలో విద్యార్థులు

ఏడాది పొడవునా మార్కులు, ర్యాంకుల పేరుతో సెలవుల ఊసే లేకుండా కళాశాలకే పరిమితమైన విద్యార్థులకు వేసవి సెలవులు ఇవ్వడం లేదు. రెగ్యులర్‌గా తరగతులను నిర్వహించడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు జేఈఈ అడ్వాన్స్‌డ్, ఏపీ ఈఏపీసెట్, తదితర ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలకు తరగతులు నిర్వహిస్తున్నాయి. బైపీసీ విద్యార్థులను నీట్‌కు సన్నద్ధం చేస్తూ జూనియర్, సీనియర్ ఇంటర్ తరగతులను సైతం నిర్వహిస్తున్నాయి. అకడమిక్ కేలండర్ ప్రకారం 2025–26 విద్యాసంవత్సరానికి జూన్ ఒకటో తేదీన ప్రారంభం కావాల్సిన తరగతులను వేసవి సెలవుల్లోనే నిర్వహించేస్తున్నాయి. వేసవిలో తీవ్రమైన ఎండల నడుమ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా తరగతుల నిర్వహణతో విద్యార్థులు అల్లాడుతున్నారు. జైళ్లలో ఖైదీలుగా మగ్గుతున్నారు.

> **సప్లిమెంటరీ పరీక్షల పేరుతో తరగతుల నిర్వహణ**

ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు మే 12 నుంచి 20 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల పరిధిలో పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ ఉత్తర్వులను ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల తరగతుల పేరుతో మిగిలిన విద్యార్థులకు సైతం రెగ్యులర్ గా తరగతులను నిర్వహిస్తున్నాయి. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు మినహా మిగిలిన వారికి సెలవులు నిర్వహించేందుకు వీల్లేదని బోర్డు ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు సెలవులుగా పరిగణించాల్సి ఉందని ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐవో జీకే జుబేర్ స్పష్టం చేశారు. సప్లిమెంటరీకి హాజరయ్యే విద్యార్థులు మినహా మిగిలిన వారికి రెగ్యులర్ తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, ఆ విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

కూటమిలో 'మేయర్' గుబులు

- పోటీ చేస్తున్నట్లు ప్రకటించిన వైఎస్సార్ సీపీ
- డెప్యూటీ మేయర్ కావాలంటూ జనసేన పట్టు
- 28న మేయర్ ఎంపికకు నోటిఫికేషన్
- ఒక హోటల్‌లో కూటమి నేతల సమావేశం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమిలో మేయర్ ఎంపిక గుబులు మొదలైంది. ఈ నెల 28న ఎన్నిక ఉండటంతో టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చించారు. మేయర్ ఎన్నికల్లో పోటీ పడుతున్నట్లు వైఎస్సార్ సీపీ ప్రకటించడంతో ఆ పార్టీలో కలకలం మొదలైంది. పలువురు కార్పొరేటర్లను కొనుగోలు చేసి స్థాయీ సంఘాన్ని దక్కించుకున్న కూటమి మేయర్ ఎన్నికపై దృష్టి పెట్టింది. మేయర్‌గా కావటి మనోహర్‌నాయుడు రాజీనామా చేయడంతో వారు ఈ పదవికి తమ పార్టీ తరపున కోవెలమూడి రవీంద్ర (నాని)ను బరిలోకి దింపారు. ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీలోనే మెజారిటీ కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. అయితే, ఇప్పటికే కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఆయన ఖర్చు పెట్టాడు. పార్టీ కోసం పనిచేస్తున్న నేపథ్యంలో అధిష్టానం రవీంద్రను అభ్యర్థిగా నిర్ణయించింది. దీన్ని ఎవరూ వ్యతిరేకించవద్దంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. శనివారం నుంచి కార్పొరేటర్లతో క్యాంపు ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

తేలని డెప్యూటీ మేయర్ అభ్యర్థి

ప్రస్తుతం కూటమికి మద్దతుగా 29 మంది ఉన్నారు. డెప్యూటీ మేయర్ అంశం రెండు పార్టీల్లో కొంత విభేదాలకు దారితీస్తోంది. డెప్యూటీ మేయర్ పదవిని జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన నిమ్మల రమణను మేయర్ అభ్యర్థి కోవెలమూడి రవీంద్రతో పాటు మరికొందరు తెలుగుదేశం నాయకులు ప్రోత్సహిస్తున్నారు. దీన్ని జనసేనలో మెజారిటీ వర్గం వ్యతిరేకిస్తోంది. మొదటి నుంచి జనసేనలో ఉన్న వారికే అవకాశం కల్పించాలని పట్టుపడుతున్నారు. దీంతో మేయర్ ఎన్నిక అయిన తర్వాత డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబుపై అవిశ్వాసం పెట్టిన తర్వాత అభ్యర్థి విషయం ఆలోచిద్దామని, తొందరపడవద్దని పెద్దలు సూచించినట్లు సమాచారం.

రవీంద్ర వ్యాఖ్యలపై కేడర్ మండిపాటు

శుక్రవారం జరిగిన సమావేశంలో తెలుగుదేశం మేయర్ అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన వారందరికి వచ్చే ఎన్నికల్లో సీటు ఇవ్వాలని ఒత్తిడి ఉందని, దీనిపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ వ్యాఖ్యలపై టీడీపీ కేడర్ మండిపడుతోంది. శుక్రవారం సాయంత్రం వన్‌టౌన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు ఈ విషయమై రవీంద్రను నిలదీసినట్లు సమాచారం. మొదటి నుంచి కష్టపడిన వారిని పక్కన పెట్టి అవసరం కోసం పార్టీలోకి తెచ్చిన వారికి సీట్లు ఎలా ఇమ్మని అడుగుతారంటూ నిలదీశారు. దీంతో కంగుతిన్న రవీంద్ర వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి బయటపడినట్లు తెలిసింది.

న్యూస్‌రీల్

ముగిసిన సదరం క్యాంప్



తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలన కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

మలేరియాను తరిమికొట్టాలి



గుంటూరు వెస్ట్: సమాజం నుంచి మలేరియాను తరిమికొట్టడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మలేరియా అంతం– మనతోనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్. రత్న మన్‌మోహన్, డాక్టర్ రత్న, సుబ్బరాయణం పాల్గొన్నారు.

■ స్వర్ణాంధ్ర–2047కు అనుగుణంగా ప్రతి నియోజకవర్గంలోనూ విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా అధికారులు, నియోజకవర్గ విజన్ ప్లాన్ యాక్షన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధి రేటు 15 శాతం సాధించే లక్ష్యంతో నియోజకవర్గాల్లోనూ శాసన సభ్యులను సమన్వయం చేసుకుంటూ అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన ఎం.శశితేజ కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నేడు వేట నిషేధ కాల భృతి పంపిణీ

బాపట్ల: మత్స్యకారులకు వేట నిషేధకాల భృతి పంపిణీని శనివారం నిజాంపట్నం మండలం కొత్తపాలెంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్యకారుల వేట నిషేధ కాల భృతి 12,671మందికి రూ.25.34లక్షలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో 7,304 మందికి, బాపట్లలో 1441 మందికి, చీరాలలో 2,836 మందికి, పర్చూరులో 1090 మందికి రూ.20 వేల వంతున పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.

గుండ్లకమ్మ వాగులో పడి బాలిక మృతి



నాగులుప్పలపాడు: ప్రమాదవశాత్తు గుండ్లకమ్మ వాగులో జారి పడి బాలిక మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత ఉప్పలపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చీకటి విజయరాజు, కృపావరం దంపతుల సంతానం కీర్తి (10)నాలుగో తరగతి చదువుతోంది. వేసవి సెలవులు కావటంతో సమీపంలోని గుండ్లకమ్మ నది వద్దకు ఆడుకుంటూ వెళ్లింది. వాగులో జారిపడి కాళ్లు పూడికలో కూరుకుపోవడంతో మృతి చెంది ఉంటుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. దుస్తులు ఉతికేందుకు వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం అందించారు.

పాకిస్థాన్ పౌరులు ఉంటే వెళ్లిపోవాలి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : పాకిస్థాన్ వీసాలతో జిల్లాలో ఉండే ఆ దేశపౌరులు ఈనెల 27వ తేదీ కల్లా దేశం విడిచిపోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశం విడిచివెళ్లకుండా ఎవరైనా అక్రమంగా నివసిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి వారికి ఆతిథ్యం కల్పించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మనోడిదే.. వదిలేయండి !

- దేవదాయ శాఖ వేలంపాటలో 'తమ్ముళ్లు'
- మనోడికి దక్కేలా చక్రం తిప్పారు
- డిపాజిట్ లేకుండానే పాటకు అనుమతి
- ఆరు నెలల అద్దెనూ చెల్లించని పాటదారుడు
- పచ్చపాతంతో ఏకపక్షంగా విలువైన ఫంక్షన్ హాలు వేలం పాట



తెనాలి: 'మనోడే పాడుకుంటాడు...మీరు వదిలేయండి!' దేవదాయ శాఖ పరిధిలోని పట్టణ బోసురోడ్డులోని శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రానికి చెందిన పాత సత్యనారాయణ టాకీస్ వేలం పాటలో పాల్గొన్న వ్యక్తులకు తెలుగు తమ్ముళ్ల నుంచి వచ్చిన ఫోను ఇది. అప్పటివరకు వచ్చిన పోటీకి మరికొంత పలికించి మనోడికి పాట వచ్చేలా చూశారు. అంతవరకూ బాగానే ఉందనుకున్నా, నిబంధనల ప్రకారం వేలంపాటలో పాల్గొనే ముందు సదరు పాటదారుడు ఇతరుల్లా డిపాజిట్ డబ్బులు చెల్లించలేదు. తన పేరిట పాట కొట్టేశాక, తొలి ఆరు నెలల అద్దె డబ్బులు కూడా చెల్లించలేదు.

తెలుగు తమ్ముళ్ల నుంచి ఫోన్లు

పట్టణంలోని శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రం స్థలంలో శ్రీ సత్యనారాయణ టాకీస్ సుదీర్ఘకాలం నడిచింది. అది మూతపడ్డాక యథా ప్రకారం దేవదాయ శాఖ వేలం నిర్వహిస్తూ వస్తోంది. కొన్నేళ్లుగా అక్కడ ఫంక్షన్ హాలు నడుస్తోంది. కాలపరిమితి పూర్తవడంతో మూడు రోజుల క్రితం వేలం నిర్వహించారు. అయిదారుగురు హాజరయ్యారు. ప్రస్తుతం నెలకు రూ.95 వేల వరకు అద్దెతో ఉన్న ఆ ఫంక్షన్ హాలు వేలం పాట రూ.1.28 లక్షల వరకు వెళ్లింది. అంతలోనే పాటదారులకు తెలుగు తమ్ముళ్ల నుంచి ఫోన్లు వచ్చాయి. ''మనోడు పాడుకుంటాడు...మీరు వదిలేయండి'' అన్నారు. దీనితో మిగిలినవారు వదిలేశారు. ధర్మసత్రం ఈవో వేలం పాటను 'మనోడి' పేరిట కొట్టేశారు. ఫోన్లు రాకపోయినట్టయితే రూ.1.60 లక్షల వరకు పాట వెళ్లేదని ప్రస్తుతం పట్టణంలో చర్చ నడుస్తోంది.

డిపాజిట్‌కు ఎగనామం

వేలంపాటలో పాల్గొనేవారు నిబంధనల ప్రకారం రూ.5 లక్షల డిపాజిట్‌ను చెల్లించాల్సి ఉంది. 'మనోడు' మాత్రం డిపాజిట్ ఇవ్వలేదు. అదేమని అడిగితే డీడీ ఇస్తానని నమ్మబలికాడు. తీరా చూస్తే చెక్కు తీసుకొచ్చి ఇచ్చాడు. వాస్తవానికి చెక్కు చెల్లింపునకు నిబంధనలు అంగీకరించవు. దీనితోపాటు పాట దక్కించుకున్న వ్యక్తి, మొదటి ఆరు నెలల అద్దె దాదాపు రూ.7 లక్షల మొత్తాన్ని వెంటనే జమచేయాలి. మనోడు ఆ రూలునూ పాటించలేదు. అలాంటప్పుడు దేవదాయ అధికారులు సంబంధిత పాటను రద్దుచేసి, మరోసారి వేలం నిర్వహించాల్సి ఉంటుంది. అయినా దేవదాయ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం విమర్శలకు దారితీస్తోంది. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా సంబంధిత అధికారులు స్పందించలేదు.

దూరవిద్యలో ఉత్తీర్ణత దూరం

- గుంటూరు జిల్లాలో 5.86 శాతం నమోదు
- దూరవిద్య టెన్త్ పరీక్షలు రాసిన 939 మంది
- ఉత్తీర్ణులైన వారు కేవలం 55 మంది
- ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వాకంతో దారుణంగా పడిపోయిన ఉత్తీర్ణత
- కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు సకాలంలో అందని పాఠ్య పుస్తకాలు
- పంపిణీలో తీవ్ర జాప్యంతో తప్పిన విద్యార్థులు



పాత బస్టాండ్ సెంటర్లోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కార్యాలయం

గుంటూరు ఎడ్యుకేషన్ : వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారి కోసం ప్రవేశపెట్టిన దూర విద్యా విధానం విద్యార్థులకు సుదూరంగా పోతోంది. సమాజంలో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రవేశపెట్టిన దూర విద్య లక్ష్యానికి చేరలేక పోతోంది. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ద్వారా టెన్త్, ఇంటర్‌లో పెద్ద సంఖ్యలో అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించి, వారికి చదువుకునే అవకాశాలను కల్పించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. బుధవారం రెగ్యులర్ టెన్త్ ఫలితాలతో పాటు ప్రకటించిన దూరవిద్య టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లాలో ఉత్తీర్ణత దారుణంగా ఉంది.

ఫలితాల్లో చతికిలపడిన జిల్లా

రెగ్యులర్ టెన్త్ ఫలితాల్లో 88.53 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా దూరవిద్య టెన్త్ ఫలితాల్లో చతికిలపడింది. 5.86 శాతం ఉత్తీర్ణతతో సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. పరీక్షలు రాసిన 939 మంది అభ్యర్థుల్లో కేవలం 55 మందే ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో ఇంతటి దారుణమైన ఫలితాలు నమోదు కావడం ఇదే మొదటిసారి. రాష్ట్రస్థాయిలో దూరవిద్య టెన్త్ ఫలితాల్లో 37.93 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, జిల్లాలో పడిపోయింది.

సొసైటీ నిర్వాకంతో దారుణంగా పడిపోయిన ఉత్తీర్ణత

దూరవిద్య టెన్త్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం పడిపోవడం వెనుక ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వాకమే కారణంగా కనిపిస్తోంది. కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడంలో విఫలమైన అధికారులు, ఉత్తీర్ణతా శాతం దిగజారిపోవడానికి కారకులుగా నిలిచారు. రాష్ట్రంలోని నాలుగైదు జిల్లాలు మినహా, మిగిలిన 20 జిల్లాల్లోనూ ఉత్తీర్ణతా గణనీయంగా పడిపోయింది.

సకాలంలో అందని మెటీరియల్

గుంటూరు కేంద్రంగా ఉన్న ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కార్యాలయం ద్వారా టెన్త్, ఇంటర్‌లో చేరిన అభ్యర్థులకు సకాలంలో మెటీరియల్ అందలేదు. 2024–25 విద్యా సంవత్సరంలో గతేడాది డిసెంబర్ నెలాఖరుకు సైతం పాఠ్య పుస్తకాలు అందలేదు. ఒకవైపు మార్చిలో జరగనున్న పరీక్షలకు ఫీజులు వసూలు చేసిన ఓపెన్ స్కూల్ సొసైటీ తాపీగా పోస్టాఫీసులకు మెటీరియల్ పంపి, చేతులు దులుపుకుంది. గతేడాది డిసెంబరులో గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని పోస్టాఫీసులో జిల్లాలకు పంపేందుకు గుట్టలుగా పడవేసిన మెటీరియల్ పార్శిళ్లు వెలుగు చూశాయి. గతంలో దూరవిద్య టెన్త్, ఇంటర్లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు అక్కడికక్కడే పాఠ్య పుస్తకాలు అందజేసే విధానాన్ని అధికారులు రద్దు చేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి పోస్టల్ ద్వారా పుస్తకాలు పంపే విధానాన్ని ప్రవేశపెట్టడంతో పంపిణీలో నెలకొన్న జాప్యంతో అభ్యర్థులకు శాపంగా మారింది.

పింఛన్‌దారులతో మర్యాదగా వ్యవహరించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: పింఛన్‌దారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో పింఛన్ల పంపిణీ సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆమె మాట్లాడారు. ఐవీఆర్‌ఎస్ నివేదిక ప్రకారంలో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు జరిగిన పింఛన్ల పంపిణీలో అనేక లోపాలను గుర్తించారని తెలిపారు. నగదు పంపిణీలో కులమతాలకతీతంగా అందరినీ గౌరవించాలని, వృద్ధులతో మర్యాదపూర్వకంగా మెలగాలని చెప్పారు. అవినీతికి పాల్పడకూడదని తెలిపారు. సిబ్బంది ఇబ్బందులు కలిగించినా, పింఛన్‌దారులతో అమర్యాదగా ప్రవర్తించినా ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కౌన్సెలింగ్‌కు హాజరుకాని సిబ్బందికి మెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ టి.వి. విజయలక్ష్మి పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తాడికొండ : వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో ఈనెల 28న జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అధికారులు పరిశీలించారు. సభా వేదిక ప్రాంగణం, పలు ప్రాంతాలను పరిశీలించారు. వీఐటీ యూనివర్సిటీ వీసీ ఎస్.వి.కోటారెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చింతమనేనిపై చంద్రబాబు చర్యలు తీసుకోవాలి

- గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్



నరసరావుపేట: మీడియాపై ప్రజాప్రతినిధులే రౌడీలుగా మారి దాడులు చేయించడం క్షమార్హం కాని నేరమని విశ్రాంత పత్రికా సంపాదకులు, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై ఈ తరహాలో దాడికి పాల్పడిన చింతమనేని ప్రభాకర్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులను కులం పేరుతో దూషించినందుకు, మహిళా ఎమ్మార్వోపై దౌర్జన్యం చేసిన నేరచరిత్ర కలిగిన చింతమనేని తీరును నాడు సభ్యసమాజం తీవ్రంగా నిరసించిందని గుర్తుచేశారు. 1997లో నైతిక విప్లవం మాసపత్రిక సంపాదకులుగా అప్పట్లో ఎన్టీఆర్ తెచ్చిన సంపూర్ణ మద్య నిషేధాన్ని నీరుగార్చిన చంద్రబాబును, మంత్రి కోడెల శివప్రసాదరావును సంపాదకీయంలో తాను విమర్శించినప్పుడు కోడెల అనుచరులు దాడి చేసి హెచ్చరించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు మేల్కొని, చింతమనేనిని మందలించి క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు.

ఇద్దరు చిన్నారులకు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం



గిన్నిస్ రికార్డుతో సంవేద్ బాబు



అభిషేక్‌కు సర్టిఫికెట్ ప్రదానం

తాడికొండ / తెనాలి : జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం లభించింది. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామానికి చెందిన 12 ఏళ్ల తోకల సంవేద్ బాబు విజయవాడలోని హల్లేల్ మ్యూజిక్ స్కూల్‌లో కీబోర్డ్ ప్లేలో శిక్షణ పొందాడు. 2024లో డిసెంబర్ 1న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారు నిర్వహించిన కీబోర్డ్ ప్లేయింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్నాడు. 50 సెకన్ల వ్యవధిలో సరళీ స్వరాలను స్పష్టంగా, అత్యంత వేగంగా పలికించినందుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు యాజమాన్యం అవార్డు ప్రకటించి మెడల్, సర్టిఫికెట్ అందజేసింది. గత ఏడాది మే 31న ఇన్ జీనియస్ చాంప్స్ వరల్డ్ రికార్డ్‌లో కూడా సంవేద్ బాబు స్థానం సంపాదించడం విశేషం.

■ తెనాలి పట్టణానికి చెందిన తొమ్మిదేళ్ల నిశ్శంకర రావు అభిషేక్ గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. గతేడాది డిసెంబరు ఒకటిన హల్లేల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా ప్రపంచస్థాయిలో 18 దేశాల నుంచి 1100 మంది విద్యార్థులు సంగీత ప్రదర్శనలో పాల్గొన్నారు. కీ బోర్డు వాయిద్యంలో అభిషేక్‌తోపాటు మొత్తం 1046 మందిని ఎంపికచేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. విజయవాడలోని మెట్రోపాలిటన్ చర్చిలో శుక్రవారం జరిగిన అభినందన సభలో మ్యూజిక్ స్కూల్ నిర్వాహకుడు అగస్టీన్ దండింగ నుంచి అభిషేక్ గిన్నిస్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందుకున్నాడు. స్థానిక కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు


గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **7,000** గరిష్టం : రూ. **9,500**

మోడల్ ధర రూ. **8,200**

క్లుప్తంగా

యార్డులో 1,08,662 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,02,336 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,08,662 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,778 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పసుపు ధరలు



దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు శుక్రవారం 698 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 520 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.11,200, గరిష్ట ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,750 పలికింది. కాయలు 178 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.11,200, గరిష్ట ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,750 పలికింది. మొత్తం 523.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు యార్డు కార్యదర్శి తెలిపారు.

సంగీత కార్యక్రమంతో మహిళకు గిన్నిస్‌లో స్థానం

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామ సచివాలయం–1 నందు గ్రామ వ్యవసాయ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న గారపాటి మణిదీప్తి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ (విజయవాడ) వ్యవస్థాపకుడు పాస్టర్ అగస్టీన్ దండిగి ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 1న నిర్వహించిన సంగీత పోటీల్లో 18 దేశాలకు చెందిన సుమారు 1,046 మంది సంగీత కళాకారులు ఆన్‌లైన్లో గంటపాటు సంగీత సరళి స్వరాలను కీబోర్డుపై ఆలపించి, వీడియోలను ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశారు. అత్యుత్తమ సంగీత స్వరాలను అందించినందుకు మణిదీప్తికి గిన్నిస్ బుక్ వారు సర్టిఫికెట్‌ను, మెడల్‌ను అందించారు.

అధిక రక్తపోటుతో అనేక అనర్థాలు

- వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు
- బీపీ చెకప్ చేసేందుకు ప్రత్యేక వాహనం ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న కృష్ణబాబు, డాక్టర్ విజయ, డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: అధిక రక్తపోటు వల్ల అనేక అనారోగ్య సమస్యలతో పాటు శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతింటాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీస్తున్న అధిక రక్తపోటును ప్రాథమిక దశలోనే గుర్తించి, అదుపులో పెట్టుకోవడం ద్వారా, ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో అధిక రక్తపోటుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది బీపీ, 25 లక్షల మంది షుగర్, బీపీ, షుగర్‌తో 22 లక్షల మంది బాధపడుతున్నట్లు స్క్రీనింగ్ పరీక్షల ద్వారా గుర్తించామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మూడేళ్లుగా రాష్ట్రంలో ఎన్‌సీడీ సర్వేలో భాగంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, జ్వరాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. స్టెమీ కార్యక్రమం ద్వారా ఎనిమిది నెలల్లో 2,300 మందికి రూ. 40వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ చేసి ప్రాణాలు కాపాడామని తెలిపారు. హార్ట్ ఎటాక్ మాదిరిగానే బ్రెయిన్ స్ట్రోక్ కూడా ప్రాణాలు తీస్తుందని, అధిక రక్తపోటును కంట్రోల్‌లో పెట్టుకోవాలని ఆయన సూచించారు.

బస్సు ద్వారా ఉచిత పరీక్షలు

ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ మాట్లాడుతూ చెక్ బీపీ – స్టాప్ స్ట్రోక్ క్యాంపెయిన్ – 2025లో భాగంగా తాము ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి, అన్ని గ్రామాల్లో ఉచితంగా అధిక రక్తపోటు పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. బీపీ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సును, బీపీ అవగాహన పోస్టర్లను కృష్ణబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ ట్రెజరర్ పి.రామచంద్రరాజు, రోటరీ ఇంటర్నేషనల్ రవి వడ్లమాని, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జి.సుబ్బారావు, ఐఎంఏ నేతలు, న్యూరాలజిస్టులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చానల్ పొడిగింపు పనులు వెంటనే ప్రారంభించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నల్లమడ రైతు సంఘం నాయకులు

ప్రత్తిపాడు: గుంటూరు చానల్ పొడిగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నల్లమడ రైతు సంఘం నాయకులు కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో వంద కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. ఇందులో ఇప్పటికే భూసేకరణ ప్రక్రియకు సంబంధించి నిధులు విడుదల చేసినట్లుగా వార్తాపత్రికల్లో కథనాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పనులను త్వరగా ప్రారంభించాలని ఆయన కోరారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి తమ ప్రాంతానికి సాగు, తాగు నీరు ఇప్పించాలని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. ఆయన వెంట పలువురు రైతు సంఘ నాయకులు ఉన్నారు.

కవి కత్తి పద్మారావుకు ఘన సన్మానం



పద్మారావు, స్వర్ణకుమారిలను సన్మానించిన రమేష్

పొన్నూరు: పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో దళిత మహాసభ పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ నేతల రమేష్ ఆధ్వర్యంలో కవి డాక్టర్ కత్తి పద్మారావు, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణ కుమారిలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కత్తి పద్మారావు, స్వర్ణ కుమారి అనేక ఉద్యమాలను నీతి, నిజాయతీగా చేసిన త్యాగమూర్తులని కొనియాడారు. కారంచేడు, చుండూరు, పిప్పర, కొత్తకోట, దంతారి, లక్ష్మీపేట వరకు ఎన్నో ఉద్యమాలు చేసిన పోరాట యోధులని పేర్కొన్నారు. దళిత మహాసభ ఆధ్వర్యంలో వారిని సన్మానించడం ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. 1989 ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ తెచ్చిన ఘనత పద్మారావుకే దక్కుతుందన్నారు. దాని వల్ల దళిత బహుజనులకు రక్షణ, సంక్షేమం అందిందని, ప్రత్యేక కోర్టులు ఏర్పడ్డాయని అభినందించారు. కార్యక్రమంలో దళిత మహాసభ ప్రతినిధులు చిగురుపాటి రత్నాకర్‌రావు, నేతలు భలేస్వామి, మాకారపు రాజు, గద్దె అచ్యుతరావు, పీఆర్వోలు గేరా ప్రసన్న కుమారి, శ్యామల, జొన్నలగడ్డ రాణి పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధుల కట్టడి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



మలేరియా ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

గుంటూరు మెడికల్: దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు సోకుతాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. దోమల నివారణతో వ్యాధులు కట్టడి చేయవచ్చని చెప్పారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మలేరియా నివారణపై వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మలేరియాపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పరస్పర సహకారం, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వల నివారణ, దోమతెరలు వాడటం, ఫ్రైడే ను డ్రైడే గా పాటించడం ద్వారా దోమకాటు బారిన పడకుండా కాపాడుకోవచ్చని ఆమె సూచించారు. ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ప్రారంభమై, నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. దోమల నివారణ చర్యలపై సిబ్బంది ప్లకార్డులు చేతపట్టి, నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మా నాయక్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజు నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్ర, ప్రశాంత్, ఆరోగ్య విస్తరణ అధికారులు గణేష, సాంబయ్య, సూపర్‌వైజర్లు సుకుమార్, మల్లికార్జునరావు, వెంకటప్పయ్య, మాస్ మీడియా అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదం

- కారు, ఆటో ఢీ
- నలుగురికి గాయాలు



ప్రమాద స్థలంలో కారు, ఆటో

ప్రత్తిపాడు: పదహారవ నంబరు జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న కారు ఒక్కసారిగా యూటర్న్ తీసుకోవడంతో వెనుక వస్తున్న ఆటో ఢీకొట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు నుంచి పల్నాడు జిల్లా గణపవరంలో రేకుల పని చేసేందుకు శుక్రవారం ఉదయం నలుగురు యువకులు ఆటోలో వెళుతున్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల సమీపంలో ముందు అతి వేగంగా వెళుతున్న కారు డ్రైవర్ వెనుక వస్తున్న ఆటోను గమనించకుండా ఒక్కసారిగా యూ టర్న్ తిప్పాడు. దీంతో ఆటో కారును ఢీకొట్టింది. హైవేపై ఆటో తిరగబడింది. ముందు భాగం ధ్వంసమైంది. ఆటోలో ప్రయాణిస్తున్న తాడికొండకు చెందిన అబ్దుల్ రవూఫ్, గుంటూరు నగరానికి చెందిన షేక్ జుబేర్, షేక్ అజీఘర్‌లకు తీవ్రంగా, షేక్ జహీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. బాధితులను ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ప్రత్తిపాడు ఎస్‌ఐ కె. నాగేంద్ర తెలిపారు.

చంద్రబాబు పాపం - విద్యార్థుల పాలిట శాపం

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కార్పొరేట్ విద్యా సంస్థల కొమ్ము కాస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరి వల్ల గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలు దిగజారాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవార ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గిందని ఆరోపించారు. నాడు విద్యా సంస్కరణలతో పాటు అమ్మఒడి వంటి అనేక పథకాలతో జగనన్న అత్యుత్తమ ఫలితాలు రాబట్టారని తెలిపారు. నేడు ఆయా పథకాలన్నీ అటకెక్కించి పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారని ఆరోపించారు. 2024లో మొత్తం 2,800 పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. 2025లో అది 1,680 పాఠశాలలకు పడిపోయిందని తెలిపారు. గతంతో పోలిస్తే 5.5 శాతం తక్కువ ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంపై కక్ష, యూపీ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల తొలగింపు వంటి అస్తవ్యస్తమైన నిర్ణయాల వలనే ఫలితాలు దారుణంగా దెబ్బతిన్నాయని తెలిపారు. మరోవైపు గతేడాది సెప్టెంబర్ వరకు టీచర్ల సర్దుబాటు చర్యలతోనే విద్యా సంవత్సరంలో విలువైన సమయమంతా వృథా అయిపోయి ఫలితాలు అడుగంటాయని పేర్కొన్నారు.

రైలు దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్‌ఐ వెంకటాద్రి

తెనాలి రూరల్: రైలు ప్రయాణికులపై కర్రతో దాడి చేసి వారి నుంచి నగదు, ఫోన్‌లు దోచుకుంటున్న ఇద్దరు నిందితులను జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి జీఆర్పీ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ జి. వెంకటాద్రి వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న రాత్రి కాకినాడ–తిరుపతి రైలులో మాచర్ల సంతోష్‌కుమార్ ప్రయాణిస్తున్నారు. రైలు నిడుబ్రోలు స్టేషన్‌కు సమీపానికి రాగానే ఇద్దరు వ్యక్తులు అతనిపై కర్రతో దాడి చేసి గాయపరిచి, సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. సంతోష్‌కుమార్ వేరే ఫోన్ నుంచి తన నంబరుకు చేశారు. నిందితులు తాము చెప్పిన నంబరుకు రూ. 20 వేలు పంపాలని డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులను నిడుబ్రోలుకు చెందిన దేవర సాయి, యర్రంశెట్టి వంశీలుగా గుర్తించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. గతంలో అపహరించిన మరో సెల్‌ఫోన్ విషయాన్ని నిందితులు చెప్పడంతో వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, నేరాలకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపర్చుకున్నారు. రైలు ప్రయాణికులపై దాడి చేయడం, దోచుకోవడం చేస్తే సహించేదిలేదని ఎస్‌ఐ వెంకటాద్రి స్పష్టం చేశారు. నేరాలను నియంత్రించడానికి గస్తీ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

బాలికల వాలీబాల్ పోటీల విజేత వాల్తేరు





వాల్తేరు, సత్తెనపల్లి జట్లకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రముఖులు

రెండో స్థానంలో నిలిచిన సత్తెనపల్లి జట్టు

సత్తెనపల్లి: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ హైదరాబాద్ 54వ రీజియన్ స్థాయి అండర్–17 బాలికల వాలీబాల్ పోటీల్లో వాల్తేరు జట్టు విజేతగా నిలిచింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని (రామకృష్ణాపురం) పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 8 జట్లు పాల్గొన్నాయి. వాల్తేరు, సత్తెనపల్లి, ఖమ్మం జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. అపూర్వ వైద్యశాల అధినేత డాక్టర్ పాలేటి నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఓటమితో కుంగిపోకుండా సాధన చేసి మరింతగా రాణించాలన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. రిటైర్డ్ పీడీ ఐఎస్ నాగిరెడ్డి, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.కిరణ్ రెడ్డి, రిఫరీలు తదితరులు పాల్గొన్నారు. శనివారం నుంచి 17 బాలుర జట్లు రెండు రోజులపాటు తలపడనున్నాయి.

ఆద్యంతం నవరసభరితం



జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభిస్తున్న ఎ.వి.బాబూరావు శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

మార్టూరులో రెండవ రోజు అలరించిన పరిషత్తు నాటికలు

మార్టూరు : మార్టూరులో శ్రీకారం రోటరీ కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి ప్రదర్శించిన మూడు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ప్రదర్శనకు ముందు రిలయన్స్ ఫౌండేషన్ ప్రకాశం జిల్లా చైర్మన్ ఏ.వి.బాబూరావు శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభించారు. 'వేదిక' సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ప్రదర్శనలలో పాల్గొన్న నటీనటులకు జ్ఞాపికలు అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన మీనాక్షి సేతురామన్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.వి.సేతురామన్, వసంత సేతురామన్ దంపతులు కళాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జేవీ మోహనరావు, శ్రీకారం కార్యదర్శి జాష్టి అనూరాధ, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, ఈశ్వర ప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య, గరివిడి శ్రీనివాసరావు, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మనిషిలోని అంతర్లీన కోణాలను స్పృశించిన '(అ)సత్యం'

స్వార్థం, నిస్వార్థం,మంచి, చెడు, దైవత్వం, రాక్షసత్వం .. ఏదైనా సరే మనిషి హృదయానికి పరిమితమై ఉంటుంది. ప్రతి సత్యం, అసత్యం వెనుక మనిషి స్వార్థం లేక భయం నిక్షిప్తమై ఉంటుంది. కంటికి కనిపించేదంతా సత్యం కాదు.. అలాగని కనిపించనిదంతా అసత్యం కూడా కాదు. యథార్థం అయినా సరే ఒక చెడుకు దోహదపడితే అది అసత్యం. అబద్ధమైనా సరే అది ఒక మంచికి దోహదపడితే అది సత్యం.. ఏది సత్యం? ఏది అసత్యం? అంటూ ప్రేక్షకులను ఆలోచింపజేసిన నాటిక శ్రీ చైతన్య కళా స్రవంతి ఉక్కునగరం విశాఖ వారి '(అ)సత్యం' నాటిక. ఎం. శ్రీసుధరచించిన ఈ నాటికకు బి.బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు.

రక్తి కట్టించిన 'జనరల్ బోగీలు నాటిక'

రైలు ప్రయాణం అందరికీ ఇష్టమైనది, సౌకర్యవంతమైనది. అయితే సామాన్యుడి నుంచి సగటు మధ్యతరగతి ప్రజల వరకు రైలులో జనరల్ బోగీలలో తక్కువ ఖర్చు కారణంగా ప్రయాణం చేస్తూ ఉంటారు. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా జనరల్ బోగీలను పెంచాల్సిన రైల్వే శాఖ క్రమేపీ బోగీలను తగ్గిస్తూ ఉండటంతో రైలులోని బాత్‌రూములు, మరుగుదొడ్లలో సైతం ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి ప్రస్తుతం మనం చూస్తున్నాం. తరచూ సంభవించే రైలు ప్రమాదాలలో జనరల్ బోగీలో ప్రయాణించే ప్రయాణికులు మరణించిన సందర్భాలలో వారి చిరునామాలు రైల్వే శాఖ వద్ద ఉండని విషయం కూడా అందరికీ తెలిసిందే. అలాంటి ప్రమాదంలో తన కొడుకును దూరం చేసుకున్న ఓ తల్లి సావిత్రమ్మ రైల్వే శాఖతోపాటు ప్రజాప్రతినిధులకు ఉత్తరాల ఉద్యమం ప్రారంభించి సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపిందన్న ఇతి వృత్తంతో సాగిన నాటిక శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించిన' జనరల్ బోగీలు'. పి.టి.మాధవ్ రచించిన ఈ నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. నాటికలో సావిత్రమ్మ పాత్రధారిగా నటించిన సీనియర్ నటి సురభి ప్రభావతి తన నటనా కౌశలంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

మహిళల మనోగతాలకు దర్పణం పట్టిన 'ఋతువు లేని కాలం'

స్వేచ్ఛ పేరిట ఉమ్మడి కుటుంబ వ్యవస్థలను, పురుషాధిక్యతా శృంఖలాలను తెంచుకుంటున్నామంటూ తమకు తామే బానిసలుగా మారుతున్న నేటి మహిళల పోకడను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన నాటిక కళానికేతన్ వీరన్నపాలెం వారి 'ఋతువులేని కాలం'. అపరిమితమైన ఆర్థిక స్వేచ్ఛతో ఆడంబరాలకు, ఫ్యాషన్లకు బానిసలౌతూ సంస్కృతీ సంప్రదాయాలకు వక్ర భాష్యం చెప్పడం, మేము అనే భావన నుండి నేను మాత్రమే అనే భావన పెరుగుతూ ఒంటరితనానికి దగ్గరవుతున్న మహిళల అంతరంగాలను ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ప్రదర్శించారు నాటికలోని నటీనటులు.

తిరుపతిలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

బాపట్ల: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు తిరుపతి నగరంలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా కార్యదర్శి మేకల బిజిలిబాబు, రాష్ట్ర మాజీ నాయకులు తన్నీరు సింగరకొండ తెలిపారు. బాపట్ల జిల్లా సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బిజిలిబాబు మాట్లాడుతూ అఖిల భారత యువజన సమాఖ్య 1959 మే 3న ఆవిర్భవించినట్లు తెలిపారు. నాటి నుంచి యువతి, యువకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై అవినీతి అంతం.. ఏఐవైఎఫ్ పంతంగా ప్రతిజ్ఞ చేసి ఎన్నో వీరోచిత పోరాటాలు చేసిందన్నారు. భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టును అమలు చేయాలని, ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న అన్నీ పోస్టులు భర్తీ చేయాలని, దేశ వ్యాప్తంగా ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 2020 నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలని యువజన హక్కుల కోసం యువత మార్పు నినాదంతో జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ బాపట్ల నియోజకవర్గ కార్యదర్శి పాట్లూరి ఏసేబు, ఇల్లా ఏసుబాబు, ఉదయరాజు,శ్రీహరి పాల్గొన్నారు.